హ్యాట్రిక్ సాధించి గిఫ్ట్‌గా ఇస్తా

- ఎమ్మెల్యే, సిటీ అభ్యర్థి ద్వారంపూడి
- పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ కేడర్


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో నాలుగో సారి కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని ఇచ్చారు. ఆ నమ్మకానికి అనుగుణంగా మూడోసారి ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో గెలవడం ద్వారా హ్యాట్రిక్ సాధించి సీఎం జగన్‌కు కాకినాడ సిటీని గిఫ్ట్‌గా ఇస్తా. ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం తన విజయానికి దోహద పడగలవని భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి హ్యాట్రిక్ సాధించడం తథ్యమంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి అభ్యర్థిత్వాన్ని సీఎం జగన్ ప్రకటించిన వెంటనే స్థానిక త్రిపురసుందరి ఆలయం సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద నగర నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ అభివృద్ధిలో కాకినాడను అగ్రగామిగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజల ఆశీస్సులతో మరోసారి ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. ప్రజల అభివృది, సంక్షేమం కోసం నిరంతరం పరితపించే ఆయనను గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో తమదైన ముద్ర వేసుకుని కాకినాడను అభివృద్ధి పథంలో నడిపించిన ద్వారంపూడి మరోసారి విజయం సాధించడం తథ్యమని పేర్కొన్నారు. ప్రజలు కూడా 'రావాలి జగన్-కావాలి జగన్', వన్స్‌మోర్ జగన్ అంటూ నినదిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. వైనాట్ 175 నినాదంలో భాగంగా తొలి విజయాన్ని కాకినాడ నుంచి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి పేరుతో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా సిఎం చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ చైర్మన్ బెండా విష్ణు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, వివిధ డివిజన్లకు చెందిన పార్టీ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

బయోడేటా

పేరు : ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
చదువు : బీకాం
నియోజకవర్గం : కాకినాడ సిటీ
పుట్టిన రోజు : 08-07-1967
భార్య : ద్వారంపూడి మహాలక్ష్మి
కుమార్తెలు : డాక్టర్ ప్రణీత ఆమె భర్త డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి, డాక్టర్ అంజని ఆమె భర్త డాక్టర్ హర్షవర్ధన్
తండ్రి : ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్
హాబీ : ట్రావెలింగ్
రాజకీయ ప్రవేశం : 1982-83
ప్రస్తుత హోదా: కాకినాడ సిటీ ఎమ్మెల్యే
చేసిన పదవులు: 1982-83 ఐడియల్ కళాశాల విద్యార్థి సంఘం జాయింట్ సెక్రటరీ.
1983-84 ఐడియల్ కళాశాల విద్యార్థి సంఘ ఉపాధ్యక్షుడు.
1988 రాష్ట్ర యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి.
2005-2009 సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్.
2005-09 హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్.
2009-14 తొలిసారి కాకినాడ సిటీ ఎమ్మెల్యే.
2019-24 రెండో సారి ఎమ్మెల్యే.
చేసిన అభివృద్ధి: 30వేల మందికి ఇళ్ల స్థల పట్టాల పంపిణీ, వినియోగంలోకి ఫ్లైఓవర్లు, పెద్దఎత్తున సంక్షేమ పథకాల అమలు, స్మార్ట్‌సిటీ ద్వారా అభివృద్ధి పనులు

సీఎం జగన్ నమ్మకాన్ని నిలబెట్టాను

- అభ్యర్థిత్వం ప్రకటనపై ఎమ్మెల్యే కన్నబాబు
- ప్రజలతో మమేకమై అభివృద్ధి, సంక్షేమానికి మరింత కృషి చేస్తానని ప్రజలకు హామీ

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది, ప్రజాభీష్టం మేరకు నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయకలిగానని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనపేరును రెండోసారి ప్రకటించడంపై కన్నబాబు శనివారం మండలం గొర్రిపూడిలో గ్రామకమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తే, సీఎం జగన్ వ్యవసాయశాఖమంత్రిని చేసి రైతులకు, ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించారన్నారు. వచ్చిన అవకాశాన్ని, జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వ్యవసాయశాఖ గౌరవాన్ని పెంచేలా పనిచేశానన్న సంతృప్తి కలిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధికి పాటుపడ్డానన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఉచిత పంటల బీమా అమలుచేయటమే కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీని ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్‌లో పరిహారం అందించామన్నారు. ఆర్‌బీకేల ద్వారా పంటను మద్దతు ధరకు కొనుగోలుచేశామన్నారు. సుమారుగా 32 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చామన్నారు. రూ.650 కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపించామన్నారు. డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా రూ.3 వేల కోట్ల మేర నియోజకవర్గ ప్రజలకు సాయమందించామన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామంటే సీఎం జగన్ సహకారం, నాయకులు, ప్రజల మద్దతు మరువలేనిదని కన్నబాబు తెలిపారు. తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి పోటీచేసే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్టు సంతోషాన్ని వ్యక్తంచేశారు. సీఎం జగన్ సారథ్యంలో నవరత్న పథకాల లబ్ధి, అభివృద్ధిని వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతూ ఎన్నికల ప్రచారం చేసి, మరొకసారి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించమని ఓటర్లను కోరనున్నట్టు ఆయన తెలిపారు.

కన్నబాబుకు పలువురి అభినందనలు

మండలం గొర్రిపూడిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభోత్సవాలు చేస్తుండగా నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకటన జరగడంతో మండల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరారవు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామకమిటీల అధ్యక్షులు ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబుకు పూలమాలవేసి తమ మద్దతును ప్రకటించారు.


కాకినాడ రూరల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ప్రకటన వెలువడగానే కన్నబాబుకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల నాయకులు

ఎమ్మెల్యేగా కన్నబాబును, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలుపించేందుకు శక్తివంచనలేకుండా పనిచేస్తామని వారు తెలిపారు.

బయోడేటా

అభ్యర్థి పేరు : కురసాల కన్నబాబు
ప్రస్తుత హోదా: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు.
విద్యార్హతలు: డబుల్ ఎంఏ
కుటుంబ వివరాలు : భార్య శ్రీవిద్య, కుమార్తె సిరి. తల్లిదండ్రులు కురసాల కృష్ణవేణి, కురసాల సత్యనారాయణ. సోదరుడు కల్యాణ్‌కృష్ణ, మరో సోదరుడు సురేష్‌బాబు 2019లో మృతి చెందారు.
రాజకీయ నేపథ్యం : 2009లో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు.
- 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 40 వేల పై చిలుకు ఓట్లు సాధించారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు.
- 2019లో వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, హార్టికల్చర్, సెరికల్చర్ తదితర శాఖల మంత్రిగా పనిచేశారు.

చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యకలాపాలు : కోవిడ్ సమయంలో మంత్రి హోదాలో ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలందించేలా స్వయంగా రాత్రి పగలు నిద్ర లేకుండా పర్యవేక్షించారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శాసన సభ్యుడిగా ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో సుమారు రూ.700 కోట్లుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పార్కులు, సామాజిక భవనాలు చిర స్థాయిలో ఆయనకు పేరు తెచ్చేలా నిలిచిపోనున్నాయి.
ఇతర వివరాలు : కాపు సామాజిక వర్గ నేతగా కన్నబాబు పేరొందారు. ఆయన వద్ద కాపులతో పాటు అన్ని సామాజిక వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉంటారు. కన్నబాబుకు తలలో నాలుకలా వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ లెక్క చేయని తండ్రి సత్యనారాయణ, సోదరుడు కల్యాణ్ కృష్ణ నిలుస్తున్నారు.

క్లుప్తంగా

క్రైస్తవుల ఆదరణ మరువలేనిది

ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి


ఎమ్మెల్యే ద్వారంపూడి విజయం కోసం ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

కాకినాడ: రాజకీయ ప్రయాణంలో క్రైస్తవుల ఆదరణ ఎన్నటికీ మరువలేనని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, ఆల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ వారు ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం కోసం సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆయనను మరోసారి గెలిపించుకునేలా ప్రార్థించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పాస్టర్లు పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి నియామకం

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరిని వివిధ అనుబంధ విభాగాల్లో నియమించారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా మైలాబత్తుల జాన్‌మోజెస్, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా కర్రి దుర్గాప్రసాద్‌లను నియమించారు.

వ్యాక్సిన్లకు ఎంతో ప్రాధాన్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్డాల

బోట్‌క్లబ్: ప్రాణాంతక వ్యాధులపై పోరాటంలో వ్యాక్సిన్ల ప్రాముఖ్యం ఎంతో ఉందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక బోట్ క్లబ్ పార్కులో శనివారం ప్రజల కు జాతీయ వాక్సినేషన్ దినోత్సవం సందర్భంగా ఐడీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీకాలు వేయడం ఆధునిక వైద్యానికి మూలస్తంభమని, ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యం శ్రేయస్సును మెరుగుపరచడంలో అవి ముఖ్యమైన పాత్ర పోషించాయన్నారు. కోవిడ్ మహమ్మారికి కూడా మన భారతదేశం వాక్సిన్ కనుగొనటం ప్రపంచ దేశాలకే తలమానికమన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసోసియేషన్ అధ్యక్షుడు కోరా నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి జయంతి

బోట్‌క్లబ్: రాఘవేంద్ర స్వామి జయంతి సందర్భంగా శనివారం మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో చొల్లంగి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న రాఘవేంద్ర స్వామి బృందావనానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్వేష్ మాట్లాడుతూ భక్తుల కోరికలను తీర్చే కల్పవృక్షంగా రాఘవేంద్ర స్వామిని అందరూ ఆరాధిస్తున్నారన్నారు. అవతారం విశేషాలను వివరించారు.

సౌకర్యవంతమైన నగరంగా కాకినాడ

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- రూ. 33 కోట్లతో రహదారుల ప్రారంభం


రూ.33 కోట్లతో నిర్మించిన రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రజలకు ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కాకినాడను సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలో రూ.33.49 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన రహదారులను ప్రారంభించారు. రూ.15.29 కోట్లతో కొండయ్యపాలెం జంక్షన్ నుంచి ఎల్‌బీ నగర్ వరకు, రూ.11.5 కోట్లతో పావురాల తూము నుంచి భగీరథ ఆలయం వరకు, రూ.6.15 కోట్లతో ఇంద్రపాలెం జంక్షన్ నుంచి ప్రతాప్‌నగర్ వంతెన వరకు ఈ రహదారులు నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్‌సిటీ నిధులను దుర్వినియోగం చేసి ప్రజలు నివసించని ప్రాంతాల్లో రోడ్లు వేశారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి తప్పులను సరిచేసి మురికివాడలతో పాటు ప్రజలకు ఉపయోగపడే ప్రాంతాల్లో రహదారులతో పాటు అనేక ప్రజాప్రయోజన ప్రాజెక్టులను నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, మాజీ కార్పొరేటర్లు కె.బాలాప్రసాద్, కొలగాని దుర్గాప్రసాద్, ఐ.శ్రీను, ఇనుకొండ పట్టాభిరామయ్య, కర్రి శైలజ, సంగాని నందం, స్థానిక నాయకులు గూటాల రామకృష్ణ, వాకాడ సత్తిబాబు, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, వివిధ డివిజన్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ


శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ ప్రజల కల నెరవేరింది. దేశ భాషలందు తెలుగు లెస్స అని మన భాషను ప్రపంచానికి చాటిన మహారాజు శ్రీకృష్ణదేవరాయలు. ఆంధ్ర భోజ బిరుదాంకితుడిగా తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం కాకినాడలో ఏర్పాటు చేయాలనేది ఎందరో అభిమానుల కల. అది నెరవేరింది. కాకినాడ ఆర్డీవో కార్యాలయం కూడలి వద్ద ఆంధ్ర కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని శనివారం ఉదయం శ్రీకృష్ణదేవరాయ స్మారక వేదిక గౌరవ అధ్యక్షుడు కురసాల సత్యనారాయణ, కాపు సద్భావన సంఘం నేతలు బసవా ప్రభాకర్‌రావు, చిట్నీడి శ్రీనివాసరావు, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ నగరంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం పెట్టాలని కోరుకుంటున్నారని, సురేష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో కాపు సద్భావన సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు విగ్రహం ఏర్పాటులో భాగస్వాములయ్యే శ్రీకృష్ణదేవ రాయలుపై ఉన్న అభిమానం చాటుకున్నారన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం సురేష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సేతు మాధవరావు, రెడ్నం రాజా, బిందాన సురేష్ తదితరులు మాధవరపు పట్టాభిరామయ్య, దామిశెట్టి శ్రీనివాస్, కర్నాసుల సత్యనారాయణ, నిరంజన్ నాయుడు, కోన ఉమేష్, అడబాల సత్యనారాయణ, కాలనీ వాసులు రవిరాజు, అడ్డాల శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో పోలీసుల కవాతు


రమణయ్యపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు, కేంద్ర దళాలు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో కేంద్ర దళాలతో సర్పవరం పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పించి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఆరు కేంద్రాలు


కరప హైస్కూలు

కరప: మండల పరిధిలో 10వ తరగతి పరీక్షలకు 6 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం నుంచి 30వ తేదీ వరకు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. కరపలో శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆరు కేంద్రాలలో 1003 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరిలో 524 మంది బాలురు, 479 మంది బాలికలు ఉన్నారన్నారు. మండల పరిధిలో 9 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 841 మంది, ఇతర మండలాల నుంచి 81 మంది, మహాత్మజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం నుంచి 48 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 33 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. కరపలో ఏ, బీ సెంటర్లు, వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించామన్నారు.

రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో శనివారం మధ్యాహ్నం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికల ప్రవర్తన నియామళి ప్రకారం రాజకీయ పార్టీలు తమ ప్రచారం కోసం ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను అధికారులు తొలగింపు ప్రారంభించారు. రమణయ్యపేట గ్రామంలో వలపాకల జంక్షన్ నుంచి సర్పవరం జంక్షన్ వరకు, అలాగే సర్పవరం జంక్షన్ నుంచి పిఠాపురం సెంటరు వైపు మార్గంలో రోడ్డు డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను రమణయ్యపేట పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తొలగించి, ట్రాక్టరులో తరలించారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


కరప మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సిబ్బందితో కలసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. గురజనాపల్లి హైస్కూలు హెచ్ఎం ఎ.సాయిమోహన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీలో న్యాయవాదుల చేరిక


ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన న్యాయవాదులు

కాకినాడ: కాకినాడకు చెందిన సుమారు 30 మంది న్యాయవాదులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరినీ ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.100 కోట్లు గ్రాంటు ఇచ్చారని, నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన యువ న్యాయవాదులకు మూడేళ్లపాటు రూ.5 వేల చొప్పున స్టైఫండ్ ఇస్తున్నారన్నారు. న్యాయవాదుల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్టు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ న్యాయవాదులకు ఆది నుంచి అండగా నిలిచారన్నారు. విద్యావంతులైన న్యాయవాదులు బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం సేవలందిస్తున్న సీఎం నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, సిటీ రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో న్యాయవాదులు బాలాజీ, జి.స్వామిశేఖర్, ఎస్.సాల్మన్‌రాజు, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, సంధాని బాషా, కత్తుల ఏడుకొండలు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 428 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కమలాదేవి. చిత్రంలో అదనపు జిల్లా జడ్జిలు

కాకినాడ లీగల్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 428 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం 428 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్ బెంచ్‌లుకు న్యాయమూర్తులుగా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్ సుందరి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మి, మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి, నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిరూప బాంజ్ డియో, ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్, స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మీకుమారి, స్పెషల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి వ్యవహరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- నడకుదురు, గొర్రిపూడిల్లో ఎమ్మెల్యే కన్నబాబు
- పేదలకు రిజిస్టర్డ్ ఇళ్ల పట్టాల పంపిణీ


నడకుదురులో లబ్ధిదారులకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


నడకుదురులో యాసలపు గోవిందరాజుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికలలో మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. మండలం నడకుదురులో శనివారం సర్పంచ్ దేగల లలితకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా భావించి, విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి 32 పథకాలు అమలుచేశారన్నారు. అతిపురాతనమైన శివాలయాన్ని పునర్నిర్మించామని, పశువుల ఆసుపత్రి భవనం, రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్‌సెంటర్ భవనాలు నిర్మించామన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 100 మెట్లు పైనే ఉంటుందన్నారు. మే నెలలో ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపి, చంద్రబాబు ఇచ్చే బెల్లం, నెయ్యి కానుక కావాలో ఇళ్లపట్టాలు, సంక్షేమ పథకాలందించే జగనన్న కానుకలు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మనసు పెట్టి ఆలోచించి సీఎం జగన్ పాలనలో మంచి జరిగిందనుకుంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ సందర్భంగా 700 మందికి రిజిస్టర్డ్ పట్టాలను ఎమ్మెల్యే కన్నబాబు అందజేశారు. ముందుగా జేఎస్‌పీకి చెందిన గ్రామ మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ యాసలపు దుర్గాప్రసాద్ సోదరుడు యాసలపు గోవిందరాజులు పార్టీలోకి చేరేందుకు ముందుకు రాగా ఎమ్మెల్యే కన్నబాబు వైఎస్సార్ సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అందరి సమన్వయంతో పార్టీ విజయానికి, తనవంతు కృషిచేస్తానన్నారు.

గొర్రిపూడిలో

గొర్రిపూడిలో పర్యటించి కరికాలభక్తుల వినతిమేరకు రూ.10 లక్షలతో నిర్మించిన కళ్యాణమండపాన్ని, జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు నిధులు రూ.96 లక్షలతో నిర్మించిన ఎనిమిది అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభోత్సవం చేశారు. గ్రామ కమిటీ చైర్మన్ చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ చీకాల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయిన్లు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లకు మూడు వాటర్‌ట్యాంక్‌లు, కమ్యూనిటీ హాళ్లు వంటి అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, రాష్ట్రబాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, జల్దాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

కాకినాడ రూరల్ ఆర్వో ఇట్ల కిశోర్



కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున శనివారం నుంచి కోడ్ అమల్లోకి వచ్చిందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద కాకినాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,64,275 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 1,31013 మంది, మహిళలు 1,33,255 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారన్నారు. 8 వేల మంది యువ ఓటర్లు ఉన్నారన్నారు. ఏప్రిల్ 1వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల నియామవళి ప్రకారం రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఉన్న వాటిని తొలగిస్తామన్నారు. అనుమతులు ఉన్న వాటికి ఖర్చులో వస్తుందన్నారు.